సాక్షి
పల్నాడు
గురువారం । 25 । ఏప్రిల్ । 2024



ముగిసిన ప్రతిష్టా వేడుకలు

శావల్యాపురం: వేల్పూరులోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టా వేడుకలు బుధవారం ముగిశాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పూజలు చేశారు.



తాగునీటి చెరువుకు గండి

రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గల తాగునీటి చెరువుకి బుధవారం గండి పడింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గండిని పూడ్చేందుకు పనులు ప్రారంభించారు.



ద్వారబంధ పూజలు

సత్తెనపల్లి: సత్తెనపల్లి సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో బుధవారం ఆశ్రమ ముఖ ద్వారం ,విశ్వేశ్వరస్వామి ఆలయానికి, నూతన ద్వారబంధ పూజలు నిర్వ హించారు.

నరసరావుపేటలో ప్రభంజనం

- అట్టహాసంగా వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నామినేషన్
- గజమాలలతో స్వాగతం
- ర్యాలీలో విశేషంగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- హాజరైన మంత్రి అంబటి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి

నరసరావుపేట: నరసరావుపేట పట్టణం జన సంద్రంగా మారింది. మండుటెండను కూడా లెక్కచేయకుండా వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమానికి జనం తరలిరావడంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. జనం అభిమానం ముందు సూర్యుడు కూడా చిన్నబోయాడు. ఎటు చూసినా వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. తొలుత వైఎస్సార్ సీపీ పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనీల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు కుటుంబసమేతంగా కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. గుంటూరురోడ్డులోని నాయబ్‌బజారు పెద్దమసీదు స్టేషన్‌రోడ్డులోని మేరికర్జ్ బాప్టిస్టు టౌన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు పొందారు. అక్కడి నుంచి రెడ్డినగర్‌కు చేరుకున్నారు. అక్కడ వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి పూజారుల నుంచి ఆశీర్వచనాలు పొందారు. 11.30గంటలకు బయటకు వచ్చిన వారికి మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీశారు. మహిళా కళాకారులు కోలాటం ప్రదర్శించారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా తయారుచేసిన ప్రచార రథంపై నామినేషన్ దాఖలుకు వెళ్లారు. వందలాది మంది కార్యకర్తలు ద్విచక్రవాహనాలు, కార్లు, వివిధ వాహనాలతో ముందు వరుసలో ర్యాలీగా కొనసాగారు. మంత్రి అంబటి రాంబాబు వచ్చి వారితో చేరటంతో శ్రేణుల్లో ఉత్సాహం మరింతగా పెరిగింది. ఎర్రటి ఎండను లెక్కచేయకుండా మహిళలు, పిల్లలు, పెద్దలు, వృద్ధులు రోడ్లవెంట బారులు తీరి వారికి స్వాగతం పలికారు. బాణసంచా మోతలు, తీన్‌మార్ బ్యాండ్ మేళాల మధ్య ర్యాలీ సందడిగా కొనసాగింది. అభిమానులు నాలుగు ప్రదేశాల్లో క్రేన్‌ల సహాయంతో ఏర్పాటుచేసిన భారీ గజమాలలను స్వీకరించారు. అభ్యర్థులు వాహనంపై నుంచి ప్రతి ఒక్కరికి అభివాదం చేస్తూ ముందుకుసాగారు. ర్యాలీ రెడ్డి కళాశాల సెంటర్, పాత పల్నాడు బస్టాండ్, ప్రభుత్వ ఏరియా వైద్యశాల మీదుగా గడియారం స్థంభం సెంటర్ వద్దకు రాగానే జిల్లా పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ర్యాలీలో వచ్చి చేరారు. అందరూ కలిసి ఆర్డీఓ కార్యాలయం ఉన్న స్టేషన్‌రోడ్డుకు మధ్యాహ్నం 2.15గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంటు స్థానానికి నామినేషన్ వేసేందుకు డాక్టర్ అనిల్, పిన్నెల్లి మరికొందరు కలెక్టరేట్‌కు వేరే వాహనంలో బయలుదేరగా, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి నామినేషన్ వేసేందుకు మద్దతుదారులతో ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్నారు. వీరితో కలిసి ర్యాలీలో డాక్టర్లు, న్యాయవాదులు, వ్యాపారులు, ఆర్యవైశ్య నాయకులు, రైతులు, కార్మికులు కొనసాగారు. బాపట్ల, నరసరావుపేట నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, గులాబ్ రసూల్, పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, పట్టణ కన్వీనర్ ఎస్.ఏ. హనీఫ్, సీనియర్ నాయకులు డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యులు పిల్లి ఓబులు రెడ్డి, పదముత్తం చిట్టిబాబు, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు, టీవీ విశ్లేషకులు, ఆడిటర్ డాక్టర్ నాగార్జునరెడ్డి, న్యాయవాదులు కట్టా నారపరెడ్డి, బాలహనుమంతరెడ్డి, డాక్టర్లు శేషిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న అనిల్‌కుమార్, డాక్టర్ గోపిరెడ్డి, రథంపై మంత్రి అంబటి



గజమాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు



నరసరావుపేటలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన జనసందోహం

అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి నామినేషన్ దాఖలు



నరసరావుపేట: నరసరావుపేట పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల వైఎస్సార్ సీపీ అభ్యర్థులు డాక్టర్ పాలుబోయిన అనీల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్ కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేయగా, ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి పి.సరోజనీకి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నామినేషన్ పత్రాలు అందజేశారు. డాక్టర్ గోపిరెడ్డి సతీమణి డాక్టర్ సుష్మితారెడ్డి కూడా అసెంబ్లీ నియోజకవర్గానికి తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్ బీ–ఫారంను ఆయన సతీమణి పి.జాగృతి రిటర్నింగ్ అధికారికి అందజేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, జేఎన్‌టీయూ సెనేట్ మెంబరు మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, పట్టణ కన్వీనర్ ఎస్.ఏ.హనీఫ్, సీమాంధ్ర డ్రగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రంగారావు, మాజీ సర్పంచు పి.ఈశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జి.వెంకటరావు పాల్గొన్నారు.



జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ ఎదుట ప్రమాణపత్రం చదువుతున్న డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్



జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్‌కు బీ ఫారం అందజేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్ సతీమణి పి.జాగృతి



నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ఆర్డీఓ పి.సరోజనికి నామినేషన్ పత్రం అందజేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి సతీమణి డాక్టర్ సుష్మితారెడ్డి

న్యూస్‌రీల్

నేడు మంత్రి అంబటి రాంబాబు నామినేషన్



సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం ఉదయం నామినేషన్ దాఖలు చేస్తారు. ఉదయం 9 గంటలకు రాజుపాలెం మండలం దేవరంపాడు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి ప్రత్యేక రథంపై ర్యాలీగా సత్తెనపల్లి చేరుకుంటారు. సత్తెనపల్లిలోని తహసీల్దారు కార్యాలయంలోని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అంబటి రాంబాబు నామినేషన్ దాఖలు చేస్తారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి తరలివచ్చి తనను ఆశీర్వదించాలని అంబటి కోరారు.

సీనియర్ సివిల్ జడ్జిగా వై శ్రీనివాసరావు

గురజాల: సీనియర్ సివిల్ జడ్జిగా వై శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నరసాపురం కోర్టు నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా గురజాల కోర్టుకు వచ్చారు. ఇప్పటి వరకు గురజాల సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న బీఎల్‌వీ శేషాద్రి కర్నూలు జిల్లా కోర్టులోని లీగల్ సెల్ అథారిటి కార్యదర్శిగా బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై శ్రీనివాసరావును న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ ఆస్తుల వివరాలు

నరసరావుపేట: పార్లమెంటు నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న డాక్టర్ పి.అనీల్‌కుమార్‌యాదవ్ బుధవారం నామినేషన్ దాఖలు చేస్తూ తనకు, తన కుటుంబానికి సంబంధించిన ఆస్తుల వివరాలను వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి తన ఆదాయం రూ.41,13,364, భార్య జాగృతి ఆదాయం రూ.13,89,690లుగా పేర్కొన్నారు. తన చేతిలో రూ.2లక్షలు, తన భార్య చేతిలో రూ.1.5లక్షలు నగదు ఉందని సూచించారు. తనకు మొత్తం చరాస్తులు రూ.2.43కోట్లు, భార్యకు రూ.2.10కోట్లు విలువ చేసేవి ఉన్నాయన్నారు. వాటిలో తనకు రెండు కార్లు, రూ.1.5లక్షల విలువచేసే బంగారం, డైమండ్ రింగ్ ఉందన్నారు. భార్యకు రూ.54లక్షలు విలువచేసే 900గ్రాముల బంగారం ఉందన్నారు. స్థిరాస్తులు తనకు రూ.1.83కోట్లు, భార్యకు రూ.4.68కోట్లు విలువచేసే ఆస్తులు ఉన్నాయన్నారు. రుణాలు రూ.1.59కోట్లు, భార్యకు రూ.41.15లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు పూజలు

క్రోసూరు: స్థానిక చెరువు కట్ట వద్ద క్రోసూరు గ్రామ అభయాంజనేయస్వామి కమిటీ ఆధ్వర్యంలో 32 అడుగుల అభయాంజనేస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం పూజలు చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యక్రమంలో పాల్గొని విగ్రహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అభయాంజనేయస్వామి కమిటీ సభ్యులు సిద్దు కామేశ్వరాచారి, కర్నాటికృష్ణారావు, కంభంపాటి కొండలు, జి.గురున్నాధం, బాలకృష్ణ, ఆంజనేయరెడ్డి, ఆముదాల వెంకట్రావు, కె.రామాంజనేయులు, మాగుంట నాగరాజు, మార్కారపు నాగేశ్వరరావు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, రవీంద్రబాబు, వెలది అప్పారావు, కాల్వపల్లి శ్రీనివాసరెడ్డి, మేదర రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

రిషితను అభినందించిన కలెక్టర్ శివశంకర్



అచ్చంపేట: పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన డొక్కు రిషిత(600/595)ను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అభినందించారు. మండలంలోని చెరుకుంపాలెం గ్రామానికి చెందిన రిషిత అచ్చంపేటలోని బ్లూ బెల్స్ హైస్కూలులో 10వ తరగతి చదివింది. తండ్రి గోవిందరాజు రైతు కాగా, తల్లి శ్రీలక్ష్మి ప్రభుత్వ టీచర్. వీరు బుధవారం నరసరావుపేట వెళ్లి కలెక్టర్ శివశంకర్‌ను కలిశారు. కలెక్టర్ రిషితను అభినందించి భవిష్యత్‌లో ఏం కావాలని కోరుకుంటున్నావ్ అని కలెక్టర్ ప్రశ్నించగా కలెక్టర్ కావాలనుకుంటున్నానని బదులిచ్చింది. సివిల్స్‌కు ఏవిధంగా ప్రిపేర్ అవ్వాలి, ఎలా సాధన చేయాలి, ఏకాగ్రత పెంచుకోవాలంటే ఏం చేయాలనే విషయాలపై కలెక్టర్ సూచనలు చేశారు.

గురజాలకు పోటెత్తిన జనం

- నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- హారతులిచ్చి ఆత్మీయ స్వాగతం
- మండుటెండను లెక్కచేయని ప్రజలు
- యువత బైక్ ర్యాలీలు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాసు మహేష్‌రెడ్డి



బహిరంగసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

గురజాల: గురజాల నగర వీధులన్నీ జనంతో కిక్కిరిపోయాయి. మండుటెండను లెక్కచేయకుండా నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కార్లు, ట్రాక్టర్లలో తరలివచ్చారు. యువకులు ద్విచక్రవాహనాలపై వచ్చారు. పార్టీ గురజాల అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డికి మద్దతు పలికారు. నామినేషన్ కేంద్రం వరకు ఆయనను అనుసరించారు. డప్పు వాయిద్యాలు, తీన్‌మార్, మేళతాళాల మోతలతో నగరం దద్దరిల్లింది. బుధవారం ఉదయం 9 గంటల నుంచే గురజాలలో పండుగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన నేత కాసు మహేష్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపిస్తామని ప్రతినబూనారు. వైఎస్సార్ సీపీ గురజాలఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ అధికారి, రిటర్నింగ్ అధికారి జీవీ రమణాకాంత్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందించారు. కాసు మహేష్‌రెడ్డి వెంట ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.



మసీదులో దువా చేస్తున్న కాసు మహేష్‌రెడ్డి



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న కాసు మహేష్‌రెడ్డి



గురజాలలో నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన జనం

పనిచేసే ఎమ్మెల్యే కావాలా... పనికిమాలిన ఎమ్మెల్యే కావాలా

నామినేషన్ అనంతరం పల్నాడు రెస్టారెంట్ వద్ద జరిగిన బహిరంగ సభలో కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మీకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ పనిచేసే ఎమ్మెల్యే కావాలా లేక పనికిమాలిన యరపతినేని శ్రీనివాసరావు కావాలా అని ప్రశ్నించగా ఒక్క సారిగా ప్రజలు పనిచేసే ఎమ్మెల్యే కావాలంటూ సమాధానం ఇచ్చారు. పాలనా సౌలభ్యం కోసం గ్రామాల్లోనే సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి పాలన అందించడం జరిగిందన్నారు. ప్రజలకు సంక్షేమం–అభివృద్ధి రెండు జగన్ అందిస్తుంటే చంద్రబాబునాయుడు ప్రజలను సోమరిపోతులను చేస్తున్నారని అంటున్నాడన్నారు. యరపతినేని ఎప్పుడు మేనిఫెస్టో విడుదల చేయలేదని కానీ నేడు విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మేనిఫెస్టో అన్న సరిగ్గా ఇచ్చాడా అంటే అది కూడా కాపీ చేశాడని ఎద్దేవా చేశాడు. టీడీపీ వారి వద్ద డబ్బు ఉంటే నా వద్ద ప్రజలు ఉన్నారు గెలిచే దమ్ము ఉందని కాసు అన్నాడు. అనిల్ కుమార్ యాదవ్ ఎక్కడి నుంచో వచ్చాడని టీడీపీ వారు అంటున్నారని మాజీ ఎంపీ గల్లా జయదేవ్, నారా లోకేష్‌లు ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. టీడీపీ వారి వద్ద నోట్లు తీసుకుని ఓట్లు మాత్రం ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), చింతలపూడి శ్రీనివాసరావు, అశోక్, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె అన్నారావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మార్కెట్ యార్డు చైర్మన్ కలకండ ఆంద్రెయ్య, కౌన్సిలర్ పోలు వీరారెడ్డి, నాయకులు మన్నెం ప్రసాద్‌రావు, కర్రా చినకోటేశ్వరరావు, చల్లా కాశీబాబు, కొమ్మినేని బుజ్జి, వేముల చలమయ్య తదితరులున్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి
- కొమెరపూడి పోలింగ్ కేంద్రం పరిశీలన
- సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో సమీక్ష సమావేశం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. అక్కడి పరిస్థితులను డీఎస్పీ జి.గురునాథ్‌బాబు, సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్‌కుమార్‌తో మాట్లాడారు. అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులతోపాటు కేసులు ఉన్న వారి పట్ల నిఘా కొనసాగాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రశాంత వాతావరణానికి కృషి చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి అల్లర్లు, ఘర్షణలు జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓట్లు వేసుకునేలా ప్రజలకు అవకాశం కల్పించాలన్నారు. గతంలో గొడవలు జరిగిన ప్రాంతాలను గుర్తించి పోలింగ్ రోజు ఘర్షణలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం



శ్రీదేవి ,భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివార్లు

రెంటాల (రెంటచింతల): మండలంలోని రెంటాల గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పూరిమెట్ల శేషా భట్టాచార్యుల నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి 7గంటల నుంచి భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు. మాచర్ల వారిచే ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ బుర్రి నెమలిరెడ్డి, దేవస్థానం కమిటీ సభ్యులు నవులూరి పిచ్చిరెడ్డి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివార్లకు పీవీఆర్ ప్రత్యేక పూజలు
వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులకు స్వామివార్లు చల్లని ఆశీస్సులు అందించి పైరు పంటలు సంవృద్ధిగా పండాలని, ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, పార్టీ నాయకులు చింతా శివారెడ్డి తదితరులున్నారు.



నరసరావుపేటలో నామినేషన్ సందర్భంగా ర్యాలీలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్



నామినేషన్‌కు ముందు మసీదులో ప్రార్థనల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ర్యాలీలో వైఎస్సార్ సీపీ అభిమానులకు అభివాదం చేస్తున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

త్రికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు

దర్శించుకున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారిని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ దంపతులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లే ముందు స్వామి వారిని దర్శనానికి వచ్చారు. కొండ దిగువున ఉన్న వినాయకుని ఆలయం, సాయిబాబా ఆలయం, కొండ మీద గొల్లభామ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం యాగశాలలో నిర్వహించిన హోమంలో డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ సుస్మితరెడ్డి, డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, జాగృతి దంపతులు పాల్గొన్నారు. తరువాత త్రికోటేశ్వరున్ని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి, మట్లా లింగారెడ్డి, మెట్టు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

గురజాల ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అఫిడవిట్ వివరాలివే

గురజాల : కాసు మహేష్‌రెడ్డి గురజాల అసెంబ్లీ యువజన శ్రామీక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ) అభ్యర్థిగా సోమవారం ఆయన తరపున నామినేషన్ దాఖలు చేశారు. కాసు మహేష్‌రెడ్డి 2022–2023 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 7,27,280 లక్షలు , కాసు మహేష్‌రెడ్డి భార్య షర్మిలి రూ. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో రూ.21,23,230 లక్షల ఆదాయపు పన్ను రిటర్న్లు జమచేసారు. కాసు మహేష్‌రెడ్డిపై 6 కేసులు నమోదయ్యాయి. చేతిలో ప్రస్తుతం కాసు మహేష్‌రెడ్డి వద్ద రూ.1,50,000/, సతీమణి షర్మిలి వద్ద రూ.1,00,000 నగదు ఉన్నట్లు, పలు బ్యాంకుల్లో 1,12,26,320, ఆస్తుల విలువ కాసు మహేష్‌రెడ్డికి రూ. 1,22,26,244.62, భార్య షర్మిలికి రూ.1,30,31,878 గా ఉంది. భార్య షర్మిలి పేరు మీద మారుతి బెలోనా కారు ఉంది. అలాగే భార్య షర్మిలి పేరు మీదు రూ.72,29,287 విలువ కలిగిన ఆస్తులు ఉన్నాయి. కాసు మహేష్‌రెడ్డి పేరు మీద రూ.2,25,00,000 విలువ కలిగిన ఆస్తులు ఉన్నాయి. ఆదాయం వ్యాపారం పై భార్యభర్తలిద్దరికీ వస్తున్నట్లు అఫిడవిట్‌లో పొందుపరిచారు.

జిల్లా మైనార్టీ విభాగ ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖలీల్

నరసరావుపేట : ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలకలూరిపేటకు చెందిన షేక్ ఖలీల్‌ను జిల్లా మైనార్టీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చిన్నగా పొమ్మని చెప్పిన వ్యక్తిపై పచ్చదండు దాడి

ఈపూరు : అధిక వేగంతో వస్తున్న వాహనాన్ని పిల్లలకు తగుతుంది.. పక్కకు పోండి అన్న మాటకు ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. వినుకొండలో జీవీ ఆంజనేయులు వేసే నామినేషన్‌కు బొల్లాపల్లి మండలం లాలిపురం నుంచి నాలుగు చక్రాల వాహనాల్లో అధిక స్పీడ్‌తో వస్తున్నారు. ఈ క్రమంలో బొమ్మరాజుపల్లి గ్రామం వద్దకు వచ్చేసరికి చిన్నారులు రోడ్డుపక్కన ఆడుకుంటుండటంతో వారికి తగులుతుందని గ్రామానికి చెందిన మారగాని కోటేశ్వరరావు చిన్నగా పోండని చెప్పడంతో వాహనంలో ఉన్నవారు ఒక్కసారిగా నలుగురు దిగి కోటేశ్వరరావుపై పిడిగుద్దులు గుద్ది కొట్టి తీవ్రంగా గాయపరిచి చొక్కా చించివేశారు. ఈలోపు గ్రామస్తులు రావడంతో వారు ఉడాయించే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు వారిని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌ఐ మహమ్మద్ ఫిరోజ్ వివరాలు తెలుసుకుని దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశారు.

మా విజయాన్ని ఎవరూ ఆపలేరు

మీడియాతో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట: ఎన్నికల్లో నరసరావుపేట నుంచి పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులుగా వైఎస్సార్‌సీపీ నుంచి పోటీచేస్తున్న డాక్టర్ పి.అనీల్‌కుమార్‌యాదవ్, తన విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు అనంతరం మీడియాతో మాట్లాడారు. తమ నామినేషన్ల దాఖలు కార్యక్రమం అద్భుతంగా జరిగిందని, ప్రజల స్పందన బాగుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు చెప్పింది చేస్తాడనే నమ్మకం ఉందన్నారు. తాను తప్పకుండా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని పేర్కొన్నారు. మేనిఫెస్టో ప్రకటించిన తర్వాత పార్టీపై ప్రజల ఆదరణ ఇంకా పెరుగుతుందన్నారు. ప్రతిపక్షాల కూటమి విఫలమైందని,. చంద్రబాబు ఎప్పుడు ఏమీ మాట్లాడతాడో చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు సంక్షేమ పథకాలు మళ్లీ పొందేలా సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించుకునేందుకు ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు బాగా స్పందించారన్నారు. ఎన్నికల్లో తాను 25వేల పైచిలుకు మెజార్టీతో గెలుస్తానని పేర్కొన్నారు. సీనియర్ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, పట్టణ కన్వీనర్ ఎస్.హనీఫ్ పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ వెలుగులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు
- పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి సన్నాహక ప్రదర్శన



పార్టీ శ్రేణులతో ప్రదర్శనలో అంబటి రాంబాబు

సత్తెనపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని 13వ వార్డులోని క్యాంపు కార్యాలయం వద్ద నుంచి 20వ వార్డు వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద నుంచి 15, 16 వార్డుల మీదుగా క్యాంపు కార్యాలయానికి సన్నాహక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచేలా సంస్కరణలతో కూడిన పరిపాలనను అందించారన్నారు. ప్రజలకు మరింత మేలు జరగాలంటే మరోసారి జగన్ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు రాజుపాలెం మండలం దేవరంపాడులోని నేతి వెంకన్న స్వామిని దర్శించుకుని పూజల అనంతరం అక్కడి నుంచి కొండమోడు, అనుపాలెం, రాజుపాలెం, రెడ్డిగూడెం, ధూళిపాళ్ల, వెన్నాదేవి మీదుగా సత్తెనపల్లి చేరుకొని నామినేషన్ దాఖలు చేయనున్నానన్నారు. నామినేషన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ఆశీర్వదించాలని కోరారు. పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన తనయలు డాక్టర్ అంబటి తేజ మౌనిక, డాక్టర్ అంబటి వెంకట మనోజ్ఞ, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి



ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ విప్ పీఆర్కే సతీమణి రమాదేవి

విజయపురి సౌత్: వైఎస్సార్‌సీపీ సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి రమాదేవి అన్నారు. బుధవారం విజయపురిసౌత్‌లో ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. ఐదేళ్ళలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ముందుగా సాగర్‌మాత దేవాలయానికి చేరుకున్న రమాదేవికి బాణాసంచా, హారతులతో మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం దేశవరం క్యాంప్ తండాలోని మహాలక్ష్మమ్మ దేవాలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల జెడ్పీటీసీ పెద్ద మల్లుస్వామి, వైస్ ఎంపీపీ సుజాత కోటిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, పార్టీ మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి, నాయకులు బూడిద సైదులు, డి సుబ్రహ్మణ్యం లాకా వెంకటరమణ, ఎస్ మస్తాన్, వంకాయలపాటి రామదాసు, కె అప్పలస్వామి, బాలమ్మ పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్ కు దరఖాస్తు చేసుకోండి

- టెన్త్ విద్యార్థులకు ఈనెల 30 వరకు అవకాశం
- అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల
- మే 24 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు



విద్యార్థులు(ఫైల్)

సత్తెనపల్లి : పదవ తరగతి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు విద్యా సంవత్సరం నష్టపోకుండా మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలను విద్యాశాఖ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మార్కులు తక్కువ వచ్చినట్లు అనుమానం ఉన్నవారు పునః మూల్యాంకనం (రీ వెరిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

హెచ్ఎం లకు మాత్రమే ఫీజు చెల్లించాలి : రీ వెరిఫికేషన్ / రీకౌంటింగ్ కోసం ఈనెల 30వ తేదీ రాత్రి 11 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. బీఎస్ఈ ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రీ వెరిఫికేషన్/రీకౌంటింగ్ ఫలితాలు వచ్చినా, రాకున్నా ఫెయిలైన విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. జవాబు పత్రాల రీకౌంటింగ్/ రీ వెరి ఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ప్రధానోపాధ్యాయుడికి మాత్రమే ఫీజును సమర్పించాలి. అన్ని రుసుము చెల్లింపులు ఆన్‌లైన్ అప్లికేషన్‌లో మాత్రమే చేయాలి. సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలాన్ ద్వారా ఫీజు చెల్లింపులు ఆమోదించరు.

ముఖ్య సూచనలు : అభ్యర్థులు వారి దరఖాస్తులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అటెస్టేషన్ చేయించి సంబంధిత విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి. నేరుగా విజయవాడలోని డీజీఈ కార్యాలయం (ఎస్ఎస్సీబోర్డు) కు పంపించకూడదు. దరఖాస్తులు పోస్టు ద్వారా స్వీకరించరు. రీ వెరిఫికేషన్ అంటే పరీక్ష పేపర్లను తిరిగి మొత్తం మూల్యాంకనం చేయరు. ఇచ్చిన మార్కులను తిరిగి లెక్కిస్తారు. రాసిన సమాధానాలన్నింటికీ మార్కులు వచ్చాయా లేదా అని ధృవీకరిస్తారు. జవాబు పత్రంలో దిద్దని ప్రశ్నలు ఉంటే దిద్ది మార్కులు కేటాయిస్తారు. స్కానింగ్ చేసి విద్యార్థి జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు. రీకౌంటింగ్ విషయంలో మార్కులు మొత్తం మరోసారి కూడతారు. తప్పుగా కూడి ఉంటే సరిచేసి మార్కులు వేస్తారు. అంతే కానీ పేపరు విద్యార్థికి ఇవ్వరు.

అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ దరఖాస్తు ఇలా : మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల టైం టేబుల్‌ను ఎస్ఎస్సీ బోర్డు త్వరలో ప్రకటించనుంది. వచ్చే నెలలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. రీకౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులకు ప్రతి పాఠశాల హెచ్ఎం, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఇప్పటికే డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష ఫీజును ఈనెల 30వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా చెల్లించే వీలుంది. మే 1వ నుంచి 23వ తేదీ వరకు రూ.50 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించే వీలుంది.

ఫీజుల వివరాలు : చెల్లించాల్సిన ఫీజులను ఆన్‌లైన్‌లో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లాగిన్ ద్వారా చెల్లించాలి. డీడీలు స్వీకరించరు. రీ వెరిఫికేషన్ ఫీజుగా ఒక్కో సబ్జెక్టుకు రూ. 1,000 చెల్లించాలి. రీ కౌంటింగ్ కు ఒక సబ్జెక్టుకు రూ. 500 చెల్లించాలి.

ఆరో రోజు 64 నామినేషన్లు దాఖలు

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆరో రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా 64మంది నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో పార్లమెంటు స్థానానికి 10మంది నామినేషన్లు వేయగా, ఏడు అసెంబ్లీ స్థానాలకు 54మంది దాఖలు చేశారు. పార్లమెంటు నియోజకవర్గానికి డాక్టర్ పాలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ తరపున ఆయన సతీమణి జాగృతి (వైఎస్సార్ సీపీ), లావు శ్రీకృష్ణదేవరాయలు తరపున పానుగోటి వీరయ్యచౌదరి (టీడీపీ) నామినేషన్ దాఖలు చేశారు, పెరువుల వెంకటేష్ (జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ), కోట పోతిరాజు (పిరమిడ్‌పార్టీ), చిలుకూరు గనేష్ (తెలుగు రాజ్యాధికారి పార్టీ), మెట్టు నారాయణరెడ్డి, చల్లా సుబ్బారావు, అట్ల చినవెంకటరెడ్డి (ఇండిపెండెంట్లు), కూచిపూడి జాన్‌బాబు (జైభీమ్‌రావు భారత్‌పార్టీ), గోదా రమేష్‌కుమార్ (జాతీయ జనసేన) నామినేషన్ దాఖలు చేశారు. పెదకూరపాడు అసెంబ్లీకి మామిడి వెంకట సత్యనారాయణమూర్తి, సెట్టి శ్రీదేవి, బాణావత్ మురళీకృష్ణ, బంకా తిరుపతి (ఇండిపెండెంట్లు), సరికుక్క చిరంజీవి (జై భీమ్‌రావు భారత్‌పార్టీ), చిలక కోటేశ్వరరావు (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), బంకా విజయకుమార్ (నవోదయం పార్టీ) దాఖలు చేశారు. చిలకలూరిపేట అసెంబ్లీకి కావటి మనోహరనాయుడు తరపున కావటి మాధవి (వైఎస్సార్‌సీపీ), మద్దుల రాధాకృష్ణ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), రావు సుబ్రమణ్యం (నవతరం పార్టీ), తుమ్మలూరి రమణయ్య (ఇండిపెండెంట్), కొప్పుల సుబ్బారావు (బీఎస్పీ), షేక్ గౌస్ (రాష్ట్రపతి జనక్రాంతి పార్టీ), పసుపులేటి శ్రీనివాసరావు (జాతీయ జనసేన) దాఖలు చేశారు. నరసరావుపేట అసెంబ్లీకి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి సుస్మితారెడ్డి (వైఎస్సార్‌సీపీ), శ్రీరామినేని ప్రసాదు, షేక్ జానిబాషా, కూచిపూడి చంద్రశేఖర్, కుమ్మెత కోటిరెడ్డి (ఇండిపెండెంట్లు), గోదా రమేష్‌కుమార్ (జాతీయ జనసేన), బూదాల బాబూరావు, బూదాల సామేలు (బీఎస్పీ), యంపరాల కాసీంసైదులు (తెలుగు రాజ్యాధికారి సమితి), షేక్ మహబూబు బాష (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) దాఖలు చేశారు. సత్తెనపల్లి అసెంబ్లీకి ఎల్.రవికుమార్, పాడి మణికంఠ, తోట వెంకటేశ్వరరావు, మక్కెల సుబ్బారావు, కందుకూరి జక్రయ్య (ఇండిపెండెంట్లు), కూరపాటి డేవిడ్‌రాజు (ఆంధ్ర రాష్ట్ర సమితి), షేక్ దరియావలి (జైభారత్ నేషనల్ పార్టీ), చుక్కా చంద్రపాల్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), జొన్నలగడ్డ విజయకుమార్ (జైభీమ్‌రావు భారత్ పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు. వినుకొండ అసెంబ్లీకి గోనుగుంట్ల లీలావతి, జీవీ ఆంజనేయులు, గోనుగుంట్ల హరీష్‌బాబు (టీడీపీ), చిరంజీవి నాయక్ (జైభారత్ నేషనల్ పార్టీ), బొల్లా వీరాంజనేయులు (ఇండిపెండెంట్), టి.అనీల్ కుమార్ (జాతీయ జనసేన) నామినేషన్లు వేశారు. గురజాల అసెంబ్లీకి కాసు మహేష్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), యరపతినేని శ్రీనివాసరావు (టీడీపీ), జూలూరి రమేష్ (జై భీమ్‌రావు భారత్ పార్టీ), తియ్యగూర యల్లమందారెడ్డి (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), చిట్టిప్రోలు సర్వేశ్వరరావు, కొప్పరపు వెంకట పురుషోత్తమరావు, చేదెలి నాగరాజు (ఇండిపెండెంట్)గా నామినేషన్లు వేశారు. మాచర్ల అసెంబ్లీకి జూలకంటి శోభారాణి, జూలకంటి బ్రహ్మానందరెడ్డి (టీడీపీ), డేగల సైదారాజు, గోపాలుని శ్రీనివాసరావు, వీఆర్ఎస్ సత్యనారాయణాచారి, షేక్ బాబూజాని, గొల్లా శ్రీనివాసరావు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు వేశారు.


సొసైటీల కంప్యూటీకరణపై అధ్యయన బృందం పర్యటన




అధికారులతో అధ్యయన బృందం సభ్యులు కే.టి. వేణుమాధవ్, విజయ చంద్రారెడ్డి

నరసరావుపేట : జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సంఘాల్లో నిర్వహిస్తున్న కంప్యూటీకరణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ శిక్షణా కేంద్రం ఫ్యాకల్టీ బృందం బుధవారం అధ్యయనం చేసింది. కంప్యూటీకరణలో ఎదురవుతున్న సమస్యలు, తదితర అంశాలపై వారు సంఘాల ఉద్యోగులకు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట బ్రాంచ్ పరిధిలోని యడ్లపాడు, నరసరావుపేట పరిధిలోని అన్నవరం, ఇక్కుర్రు, లింగంగుంట్ల, అమరావతి బ్రాంచ్ పరిధిలోని నరుకులపాడు, పెదమద్దూరు, మునుగోడు సొసైటీలను ఈ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా డీజీఎం కె. విజయచంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కంప్యూటీకరణ కార్యక్రమాన్ని ఆప్కాబ్ ఎండీ ఆదేశాల మేరకు సందర్శించినట్లు తెలిపారు. సొసైటీల్లో కంప్యూటీకరణకు అవసరమైన మ్యాన్ పవర్, టెక్నాలజీని అందచేసేందుకు అధ్యయనం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రిటైర్డ్ జీఎం కే.టి వేణుమాధవ్, జీడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ చింతల అజయ్‌కిషోర్ కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి పి. నారాయణ స్వామి, జీడీసీసీ బ్యాంక్ ఏజీఎంలు బి. సుబ్బారావు, బాబురావు, బత్తుల బాలకృష్ణారెడ్డి, టి. శ్రీనివాస్, చీఫ్ మేనేజర్‌లు ఎస్. రమాదేవి, ఆర్. సుధీర్, మేనేజర్‌లు జి. శ్రీనివాస్, ఏఎంలు అనిల్, ఎన్, వెంకటేశ్వర్లు, సంఘ సీవోలు వెంకటరెడ్డి, రామాంజనేయులు, కంటు శ్రీనివాసరావు, టి. రాంబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అదే నిర్లక్ష్యం



ఆగిపోయిన బస్సు



ఊడిపోయిన టైర్లు

వినుకొండ (నూజెండ్ల): ఎన్ని ప్రమాదాలు జరిగినా వినుకొండ ఆర్టీసీలో నిర్లక్ష్యం కొనసాగుతునే ఉంది. తాజాగా వినుకొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న హైటెక్ సూపర్‌లగ్జరీ బస్సు వినుకొండ నుంచి కారంపూడి మండలం ఒప్పిచర్ల వద్దకు వెళ్లగానే వెనుక చక్రాలు రాడ్డుతో సహా ఊడిపోయి బస్సు నడిరోడ్డుపై ఆగిపోయింది. చక్రాలు వేగంగా సమీప పొలాల్లోకి దొర్లుకుంటూ వెళ్లాయి. దీంతో టైర్లు ఎవరికి తగలకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బస్సు ఒక్కసారిగా కుదుపులకు గురై రోడ్డుకు గుద్దుకోవడంతో ప్రయాణీకులు భయభ్రాంతులకు గురయ్యారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రయాణీకులు విమర్శలు గుప్పిస్తున్నారు.